సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 23 । మే । 2025



రైతన్నలు జర పైలం

నకిలీ విత్తనాలతో రైతులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

8లో▸



పహాడీషరీఫ్: ర్యాలీలో భారీగా పాల్గొన్న భక్తులు



హనుమాన్ వేషధారణలో భక్తుడు

ఉప్పొంగిన భక్తిభావం

హనుమాన్ జయంతి వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హనుమంతుడి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. మరోవైపు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్రలు చేపట్టారు. జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.

న్యూస్‌రీల్

విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకే శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

షాబాద్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు పేర్కొన్నారు. షాద్‌నగర్ ఢిల్లీ వరల్డ్ స్కూల్ పాఠశాలలో గురువారం షాబాద్ మండల ఉపాధ్యాయులకు ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రాథమికస్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో శిక్షణ తరగతులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. శిక్షణ తరగతుల్లో ఎఫ్ఎల్ఎన్, మూల్యాంకన, కనీస అభ్యసన సామర్థ్యాలు, సులభంగా గణితం నేర్చుకోవడం తదితర అంశాలపై శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వీటిని పాఠశాలలో అమలుపర్చి విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన మెరుగుపర్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోధనలో సాంకేతికత జోడించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డి.లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు కృష్ణ, అంజయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ



షాద్‌నగర్: మహబూబ్‌నగర్ సీసీఎస్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తించిన లక్ష్మీనారాయణ షాద్‌నగర్ ఏసీపీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లకు పైగా ఏసీపీగా ఇక్కడ విధులు నిర్వర్తించిన రంగస్వామిని డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో లక్ష్మీనారాయణ వచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. బదిలీపై వెళ్తున్న రంగస్వామికి వీడ్కోలు పలికారు.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగిరం చేయాలి



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పనులు (గ్రౌండింగ్) ఈనెల 25 లోపు పూర్తి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్ కె.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ శాఖ అధికారులు, మండల పరిషత్ సిబ్బందితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రౌండింగ్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా 600 ఎస్ఎఫ్‌టీ కొలతలతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వచ్చేది వర్షాకాలమని ఆలోపు నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. అదేవిధంగా ఈనెల 25లోపు రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీల్లో అర్హుల జాబితాను రూపొందించి నివేదికను కలెక్టర్‌కు అందజేయాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్, ఎంపీఓ రఘు, హౌసింగ్ శాఖ విజిలెన్స్ బలరాం, డీఈ సంపత్, ఏఈ రాంచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'గ్రేటర్'లో అదనపు డీసీపీల బదిలీ

కొత్తగా 12 మంది అధికారులకు పోస్టింగులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో 30 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 12 స్థానాలు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు సంబంధించిన అదనపు డీసీపీలవి ఉన్నాయి. హోదా అదనపు, నాన్-క్యాడర్ ఎస్పీలు అయినప్పటికీ కమిషనరేట్లలో అదనపు డీసీపీలుగా పని చేస్తుంటారు.

ఆలయ ఆస్తులకు రక్షణ!



అన్యాక్రాంతమవుతున్న దేవుడి భూములు

- 9,360 ఎకరాల్లో ఇప్పటికే 1,148 ఎకరాలు కబ్జా
- హారతి కర్పూరంలా కరిగిపోతున్న ఆస్తులు
- పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- డీజీపీఎస్ సర్వే చేయించే యోచన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అక్రమార్కుల చెరలో చిక్కిన ఆలయ భూములకు విముక్తి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న భూములకు డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) సర్వే చేయించాలని భావిస్తోంది. సరిహద్దుల గుర్తింపు, భూముల డిజిటలీకరణ చేసి, అన్ని వివరాలను దేవుడి పేరున ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా ఆయా భూములకు రక్షణ కల్పించొచ్చని యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దేవాలయాల పేరున మొత్తం 87,235.39 ఎకరాల భూములు ఉండగా, ఇప్పటికే 20,124.03 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు సమాచారం. ఒక్క మన జిల్లాలోనే 9,360 ఎకరాలకు 1,148.15 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తెలిసింది. దేవుడి ఆస్తులకు కాపలాదారులుగా వ్యవహరించాల్సిన పాలక మండళ్లు, దేవాదాయశాఖ అధికారులు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు వ్యవహరించారు. ఆలయ భూములను హారతి కర్పూరంలా కరిగించేశారు.

తొలి విడతలో ఆ మూడు జిల్లాలు

దేవాలయాల్లో ధూపదీప నైవేద్యం కోసం అనేక మంది దాతలు దేవాలయాలకు సొంత భూములను దానం చేశారు. కౌలు, అద్దెల ద్వారా వచ్చిన దాంతో దేవాలయాల నిర్వహణ జరిగేది. ప్రస్తుతం భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో దేవుడి భూములకు రక్షణగా నిలువాల్సిన దేవాదాయశాఖ, పాలక మండళ్లు, ఆయా భూములను కరిగించేశాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో ఆక్రమణకు గురయ్యాయి. ఆక్రమణల బారి నుంచి ఆయా భూములను కాపాడేందుకు ప్రభుత్వం రంగారెడ్డి సహా హైదరాబాద్, నల్లగొండ జిల్లాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి డీజీపీఎస్ సాంకేతికతతో పాటు జీపీఎస్, ఈటీఎస్ (ఎల్రక్టానిక్ టోటల్ స్టేషన్), క్యాడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సర్వే చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. సర్వే పూర్తయిన వెంటనే ఆయా భూముల వివరాలు, నక్షా హద్దులు, ఆన్‌లైన్‌లో పొందుపరిచే అవకాశం ఉంది. సర్వే విజయవంతమైతే ఆలయ భూముల రక్షణ డిజిటలీకరణ, చట్టపరమైన హక్కుల నిర్ధారణలో ఒక మైలురాయిగా మిగిలిపోనుంది.

జిల్లాలో మచ్చుకు కొన్ని..

- మాడ్గుల మండలం అర్కపల్లి ఆంజనేయస్వామి దేవాలయం పేరున అదే రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 88లో 9.18 ఎకరాలు, సర్వే నంబర్ 79/ఎ4లో 20 గుంటలు, సర్వే నంబర్ 283లో 11 ఎకరాలు, సర్వే నంబర్ 241లో 11.06 ఎకరాలు (మొత్తం 34) ఉంది. విలువైన ఈ భూములపై ఇప్పటికే కొంత మంది కన్నేశారు. తప్పుడు నిరంభ్యంతర పత్రాలు సృష్టించి, ఆక్రమించేందుకు యత్నిస్తున్న విషయం తెలిసిందే.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇంజాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఇంజాపూర్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 19 నుంచి 34 వరకు, 103 నుంచి 150 వరకు, 130,187,188,191,192,193,194,100లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 68.18 ఎకరాల భూములు ఉండగా, దేవాదాయశాఖ రికార్డుల ప్రకారం 74.15 ఎకరాల భూమి ఉంది. ఉప్పల్ ఖల్సా సర్వే నంబర్ 801,807,808,809లో 6.38 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే సర్వే నంబర్ 21, 195 సర్వే నంబర్లలోని విలువైన భూములను కబ్జాదారులు చెరబట్టారు.
- యాచారం మండలం నందివనపర్తిలోని ఓంకారేశ్వరాలయానికి తాడిపర్తి, నస్దిక్‌సింగారం, నందివనపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 1,450 ఎకరాలు ఉన్నాయి. 1,200 మంది రైతులు ఈ భూములు సాగు చేసుకుంటున్నారు.
- కొందుర్గు మండలం పెండ్యాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి 360 ఎకరాలు ఉన్నాయి. కొందుర్గులోని కొంతభాగం, లూర్దునగర్ కాలనీలు ఇందులోనే వెలిశాయి. ప్రస్తుతం 312 ఎకరాలే మిగిలి ఉంది.
- కడ్తాల్‌లోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి సర్వే నంబర్లు 76,120,125,130,213, 841,848,849లో మొత్తం 41.29 ఎకరాల భూమి ఉంది.
- శంషాబాద్ మండలం అమ్మపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి సర్వే నంబర్లు 1 నుంచి 8 వరకు, అదే విధంగా 10 నుంచి 18 వరకు, 20 నుంచి 46 వరకు సర్వే నంబర్లలో 222 ఎకరాల భూమి ఉంది. మరో 44 ఎకరాలకు పైగా భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి.
- బాలాపూర్ మండలం మామిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సర్వే నంబర్లలో 50,52,53,54,65,66,67లో మొత్తం 33.12 ఎకరాలు ఉండగా, ఇప్పటికే మెజార్టీ భూములు వివాదంలో కొనసాగుతున్నాయి.
- మహేశ్వరం మండలం జెన్నాయిగూడలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి 800 ఎకరాలకు పైగా భూములు ఉండగా, ఇప్పటికే మెజార్టీ భూములు ఫ్యాబ్‌సిటీ పరిధిలోకి వెళ్లాయి. మిగిలిన కొద్ది భూములను కాజేసే యత్నం కొనసాగుతోంది.

పర్యటించి.. సమస్యలు విని

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ గురువారం ఉదయం పర్యటించారు. కాలనీలోని రోడ్డు నంబర్–6లోని ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గందు ధనంరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు నంబర్ 2,14లలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. రోడ్డు నంబర్ 5లో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో తేలికపాటి వర్షం కురిసినా చెరువును తలపిస్తోందన్నారు. కాలనీలోని రోడ్లు దాదాపు 15 సంవత్సరాల నుంచి పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయని అన్నారు. కమిషనర్ స్పందిస్తూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, ఉప కమిషనర్ సుజాత, కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసారావు, కోశాధికారి సాయికిరణ్, శ్రీనివాసారావు, సుధాకర్, నరేష్, సత్యనారాయణ రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

12 ఏళ్లుగా అజ్ఞాతంలోనే..

- ఉద్యమాలకు ఆకర్షితురాలై వెళ్లి..
- ఎన్‌కౌంటర్‌లో కన్నుమూసిన విజయలక్ష్మి
- సొంతూరు కేశంపేట మండలం వేములనర్వ



విజయలక్ష్మి (ఫైల్)

కేశంపేట: ఉన్నత చదువులకు హైదరాబాద్ వెళ్లిన మహిళ అక్కడి నుంచే ఉద్యమబాట పట్టింది. 12 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండి ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కన్నుమూసింది. ఆమే కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన వన్నడ విజయలక్ష్మి అలియాస్ భూమిక. గ్రామంలోని వన్నడ సాయిలు గౌడ్ మొదటి భార్య రాధమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. విజయలక్ష్మి మూడో సంతానం. విజయలక్ష్మి పుట్టిన ఏడాదికి పాము కాటుకు గురై రాధమ్మ మృతి చెందింది. విజయలక్ష్మి కేశంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం అక్కడే ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. డిగ్రీ మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఎన్‌టీఆర్ మహిళ కళాశాలలో చదివింది. అనంతరం నిజాం కళాశాలలో ఎల్ఎల్‌బీ చేస్తున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమబా ట పట్టింది. అప్పటి నుంచి కుటుంబ బంధాలను తెంచుకుంది. ఉద్యమంలోకి వెళ్లిన తర్వాత విజయలక్ష్మితో ఎప్పుడూ మాట్లాడలేదని, గ్రామంలోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. చదువుకుంటున్న సమయంలో గ్రామంలో చిన్నపిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెప్పినట్టు గ్రామస్తులు తెలిపారు.

తొలిరోజే.. విద్యార్థికి అందేలా..

- నేటి నుంచి ప్రభుత్వ బడులకు పాఠ్య పుస్తకాల సరఫరా
- ఇప్పటికే ఎమ్మార్సీలకు 80 శాతం కోటా చేరవేత
- ప్రత్యేకంగా దృష్టి సారించిన విద్యాశాఖ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నూతన విద్యా సంవత్సరం తొలి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసేలా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు పుస్తకాల సరఫరా ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే పుస్తక ముద్రణాలయం నుంచి ప్రధాన గోదాములకు పాఠ్యపుస్తకాలు స్టాక్ చేరడంతో ఎమ్మార్సీ పాయింట్లకు చేరవేస్తోంది. అక్కడి నుంచి జూన్ 12 నాటికి పాఠశాలకు పూర్తిస్థాయి ఇండెంట్ సరఫరా జరిగే విధంగా చర్యలకు ఉపక్రమించింది.

27.5 లక్షల పాఠ్య పుస్తకాలు

- గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 2,515 సర్కారు బడులు ఉండగా.. వీటిలో సుమారు 3.41 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సుమారు 27.5 లక్షల పాఠ్య పుస్తకాలు అవసరం. ఇండెంట్ ప్రకారం ఇప్పటికే ప్రధాన గోదాముకు 80 శాతం వరకు పాఠ్య పుస్తకాలు చేరుకున్నట్లు సమాచారం.
- హైదరాబాద్ జిల్లాలోని సర్కారు స్కూళ్లలో ప్రస్తుతం 2 నుంచి 10వ తరగతి వరకు 1,07,947 మంది విద్యార్థులున్నారు. ఈసారి కొత్తగా ఒకటో తరగతిలో 2 నుంచి 3 వేల మంది చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈసారి 12.50 లక్షల పుస్తకాల ఇండెంట్ పెట్టారు. అందులో ఇప్పటివరకు 8.40 లక్షలు ఎమ్మార్సీలకు చేరాయి.



మోత తగ్గించేందుకు..

విద్యార్థులకు మోత భారం తగ్గించేందుకు తక్కువ బరువు కలిగిన కాగితంతో పాఠ్యపుస్తకాలు ముద్రించారు. మరోవైపు ప్రభుత్వ బడులకు సరఫరా చేసే పుస్తకాలు పక్కదారి పట్టకుండా ప్రతి దానికి వరుస సంఖ్య క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశారు.

మెట్రో డీపీఆర్‌లకు పచ్చజెండా!

మేడ్చల్ కారిడార్‌లో 18, శామీర్‌పేట్‌లో 14 స్టేషన్లు

- నార్త్, ఫ్యూచర్ సిటీ మార్గంలో రోజుకు 3లక్షల మంది ప్రయాణించేలా..
- రూ.19,579 కోట్లతో హెచ్ఏఎంఆర్ఎల్ ప్రణాళికలు
- త్వరలో కేంద్రానికి నివేదన: మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మెట్రో రెండో దశలో భాగంగా 'బి' విభాగం కింద ప్రతిపాదించిన మూడు కారిడార్లకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధమయ్యాయి. నార్త్‌సిటీలో ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట్ రూట్‌లలో, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు మూడు కారిడార్‌లలో మెట్రో నిర్మాణానికి రెండో దశలోనే ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. మొదటి ఐదు కారిడార్‌లతో పాటు ఈ మూడు కారిడార్‌లను సైతం రెండో దశలో భాగంగా చేపట్టనున్నారు. మొదటి ఐదు కారిడార్‌ల డీపీఆర్‌లు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో నాలుగు నెలల క్రితమే కేంద్రానికి అందజేశారు. 'బి' విభాగం కింద ప్రతిపాదించిన ఈ మూడు కారిడార్‌ల డీపీఆర్‌లను సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో త్వరలో కేంద్రానికి పంపించనున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ (హెచ్ఏఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన డీపీఆర్‌ల వివరాలు వెల్లడించారు. కేంద్రం నుంచి అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. డీపీఆర్‌లను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌మెట్రో రైల్ బోర్డు ఈ నెల 8న ఆమోదించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ మూడు కారిడార్‌ల నిర్మాణం పూర్తయ్యే నాటికి ప్రతిరోజూ సుమారు 3 లక్షల మందికి పైగా రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2028 నాటికి రెండో దశలోని అన్ని రూట్లలో 10 లక్షల మందికి పైగా ప్రయాణించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

జేబీఎస్.. మెట్రో హబ్

జేబీఎస్ ప్యారడైజ్ స్టేషన్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో అతిపెద్ద మెట్రో హబ్‌ను నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి శామీర్‌పేట్, మేడ్చల్ మార్గాల్లో మెట్రో విస్తరణ చేపట్టనున్నారు. ప్రయాణికులు ఒక కారిడార్ నుంచి మరో కారిడార్‌కు మారేందుకు స్కైవాక్ ఏర్పాటు చేస్తారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు మొత్తం 24.5 కిలోమీటర్ల మార్గంలో 18 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. అలాగే జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీల కారిడార్‌లో 14 మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. మెట్రో రెండో దశలో 'బి' విభాగం కింద రు.19,579 కోట్ల అంచనా వ్యయంతో 86.1 కి.మీ పొడవు గల జేబీఎస్- మేడ్చల్, జేబీఎస్- శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్- ఫ్యూచర్ సిటీ మెట్రో రెండో దశ (బి) కారిడార్లకు డీపీఆర్‌లను రూపొందించినట్లు ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

రూ.43,579 కోట్ల వ్యయంతో 8 కారిడార్‌లు

మెట్రో రెండో దశలో ప్రభుత్వం మొదట 76.4 కిలోమీటర్లతో 5 కారిడార్‌ల నిర్మాణానికి సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేశారు. కేంద్రం నుంచి ఆమోదం లభిస్తే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. సుమారు రూ.24 వేల కోట్ల అంచనాలతో రెండో దశలో మొదటి 5 కారిడార్‌లను ప్రతిపాదించారు. ప్రస్తుతం మరో 3 కారిడార్‌లకు డీపీఆర్‌లు పూర్తయ్యాయి. రెండోదశ కింద ప్రతిపాదించిన మొత్తం 8 కారిడార్‌లలో సుమారు 162 కి.మీల నిర్మాణానికి రూ.43,579 కోట్ల వ్యయం కానుంది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు. కానీ.. కేంద్ర కేబినెట్ దీనిపై దృష్టి సారించినప్పుడే కీలకమైన ముందడుగు పడ్డట్లుగా భావించాలి.

ఆపరేషన్ కగార్‌పై విచారణ చేపట్టాలి



జనసేవా దళ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: నక్సలైట్ల ఏరివేతనే లక్ష్యంగా చేసుకొని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌పై వెంటనే సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఈ నెల 26 నుంచి 31 వరకు నిర్వహించే జనసేవా దళ్ శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆయన రాష్ట్ర నాయకులు పర్వతాలు, కే. రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సలైట్ల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం పని చేస్తుందే తప్పా, వారితో చర్చలు చేయడానికి అడుగులు వేయకపోవడం బాధాకరమన్నారు. చేవెళ్లలో జరిగే జనసేవా దళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని, ఈ జనసేవా సైనికులు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, వివిధ సేవా పనులు చేయడానికి కృషి చేయనున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ నాయకులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- చేతిలోని ఇనుప రాడ్ కరెంటు తీగలకు తగిలి ప్రమాదం
- ఇంటి రేకులపై చెత్తను తొలగిస్తున్న క్రమంలో ఘటన



శ్రీకాంత్ (ఫైల్)

నందిగామ: విద్యుతాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నర్సప్పగూడలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి శ్రీకాంత్(35) చేగూరు రోడ్డులో ఓ హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం హోటల్ వద్దకు వెళ్లిన శ్రీకాంత్ హోటల్ పైకప్పు రేకుల వద్ద చెత్తాచెదారాన్ని తొలగించేందుకు రాడ్‌తో ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఓ కూతురు, కొడుకు ఉన్నారు.

యువకుడిపై కుక్కల దాడి

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధి వెలిజర్ల గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఓ యువకుడి పై కుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన ప్రణయ్ ఇంటి నుంచి ఆటో కూడలికి వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా శునకాలు దాడి చేసి, కాళ్లను కరిచాయి. వెంటనే కుటుంబ సభ్యులు యువకుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు తరచూ దాడి చేస్తున్నాయని, వాటిని తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం



సుజాత

శంషాబాద్ రూరల్: సోదరుడి ఇంటికి వచ్చిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఫరూఖ్‌నగర్ మండలం చిలకమర్రి గ్రామానికి చెందిన పెంటని సుజత(35) ఈ నెల 14న శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని గొల్లపల్లిలో ఉన్న తన సోదరుడు భాస్కర్ ఇంటికి వచ్చింది. రెండు రోజుల తర్వాత సుజత తిరిగి స్వగ్రామానికి వెళ్లకపోవడంతో.. భర్త నర్సింహులు ఆమె సోదరుడుకి ఫోన్ చేసి మాట్లాడాడు. సుజాత గొల్లపల్లి నుంచి 15న ఉదయం వెళ్లిపోయిందని చెప్పాడు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతన్నలు జర పైలం



నకిలీ విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

విత్తనాల ఎంపికలో జాగ్రత్త

- కేటుగాళ్లను నమ్మిమోసపోవద్దు
- గుర్తింపు ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోళ్లు చేయండి: అధికారులు

షాబాద్: నకిలీ విత్తనాలతో రైతులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వానాకాలం(ఖరీఫ్) సీజన్ నేపథ్యంలో కొందరు వ్యాపారులు అనధికారికంగా పల్లెప్రాంతాల్లోనే ఫర్టిలైజర్ దుకాణాలు కొనసాగిస్తూ అన్నదాతలను మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత కాలం ప్రారంభం నేపథ్యంలో కర్షకులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారని, అదే అదునుగా భావించిన కేటుగాళ్లు నాసిరకం విత్తనాలను అంటగడుతుంటారని, విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

రసీదు తప్పనిసరి

మారుమూల ప్రాంతాల రైతులే లక్ష్యంగా కేటుగాళ్లు నకిలీ విత్తనాల దందాకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉండటం, ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో.. వారికి సులువుగా నాసిరకం విత్తనాలను అంటగడుతూ నిలువుగా ముంచేస్తున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఉన్నాయి. అలా కాకుండా రైతులు వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు పొందాలని, వాటిని పంట చేతికొచ్చేవరకు భద్ర పరుచుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

వర్షధార పంటలు

మండలంలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో ప్రాంత అన్నదాతలు వర్షధార పంటలు సాగు చేస్తుంటారు. వానలు పడితేనే సాగు పనులు మొదలు పెడుతుంటారు. విత్తనాలు విత్తుకుంటారు. రైతులు అవసరాల దృష్ట్యా.. కొందరు వ్యాపారులు మాయమాటలు చెబుతూ ఈ విత్తనం విత్తితే దిగుబడి బాగా వస్తుందని పేర్కొంటూ నాసిరకం సీడ్స్ అంటగడుతుంటారు. ఇవేమీ తెలియని కర్షకులు.. నకిలీ విత్తనాల బారిన పడి, పంట చేతికి రాక ఆర్థికంగానూ, సమయంపరంగానూ తీవ్రంగా నష్టపోతుంటారు. అందుకే విత్తనాల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండి, వాటిని పరిశీలించి కొనుగోలు చేయాలని పేర్కొంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకాణంలోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసే ముందు లేబుల్, విత్తన ప్యాకెట్లను జాగ్రత్తగా పరిశీలించాలి.
- విత్తన, ఎరువు సంచి ధ్రువీకరణ నంబర్, తేదీ, విత్తన రకం, ధర తదితర వివరాలను సరిచూసుకోవాలి.
- కొనుగోలు అనంతరం రసీదు తీసుకోవాలి.
- నకిలీ వ్యాపారులకు దూరంగా ఉండాలి. మాయమాటలతో మోసపోవద్దు.
- విత్తనాలపై ఎలాంటి అనుమానం ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



నకిలీ విత్తనాల గురించి మండల పరిధి రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. లైసెన్స్‌ను రద్దుచేస్తాం. విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు.. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. సూచనలు, సలహాలు తీసుకోవాలి.

– వెంకటేశం ఏఓ, షాబాద్

చట్టపరమైన చర్యలు



నకిలీ విత్తనాలు అమ్మడం నేరం. రైతులకు.. వాటిని విక్రయించినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఫర్టిలైజర్ దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తాం. వ్యాపారులు తమ దుకాణం ఎదుట తహసీల్దార్, వ్యవసాయ అధికారి, ఎస్సై మొబైల్ నంబర్లతో కూడిన బోర్డు పెట్టాలి. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే.. వెంటనే సమాచారం ఇవ్వండి.

– కాంతారెడ్డి సీఐ, షాబాద్

ఆర్మీ మాజీ ఉద్యోగి అరెస్టు

అధిక వడ్డీ ఆశ చూపించి మోసం

- రూ.4.48 కోట్లు వసూలు చేసి పరారీ
- న్యూఢిల్లీలో అరెస్టు చేసిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ ఆశ చూపించి అమాయకుల నుంచి డిపాజిట్లు సేకరించి, మోసం చేసిన ఆర్మీ మాజీ ఉద్యోగిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు గురువారం అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన జితేంద్ర కుమార్ చౌబే మాజీ ఆర్మీ ఉద్యోగి. తిరుమలగిరిలోని మిలిటరీ కళాశాలలో ఎలక్ట్రీషన్‌గా పనిచేసి, 2018లో రిటైర్ అయ్యాడు. అనంతరం బొల్లారంలో స్థిరపడ్డాడు. మాజీ ఆర్మీ ఉద్యోగి కావడంతో స్థానికంగా పలువురితో పరిచయాలు ఏర్పడ్డాయి. దీనిని ఆసరాగా చేసుకొని వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్న జితేంద్ర అల్వాల్ కేంద్రంగా జేకే ఎంటర్‌ప్రైజెస్, సౌమ్య శ్రీ ఆసుపత్రి, కార్తీక్ లాజిస్టిక్స్ పేర్లతో పలు కంపెనీలను ఏర్పాటు చేశాడు. తన సంస్థలలో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి, అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించాడు. నెలకు 5 శాతం వడ్డీ ఆశ చూపించి, రూ.4.48 కోట్లు వసూలు చేశాడు. స్థానికులు, వ్యాపారస్తులతో పాటు మాజీ ఆర్మీ ఉద్యోగులు కూడా అతడి వద్ద పెట్టుబడులు పెట్టారు. వారికి కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లించిన జితేంద్ర గత డిసెంబర్‌లో రాత్రికి రాత్రే కంపెనీలను మూసేసి పరారయ్యాడు. దీంతో బొల్లారానికి చెందిన చంద్రావతి అనే బాధితురాలు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు న్యూఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి జితేంద్రను అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

అత్తాపూర్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నౌ నెంబర్ ప్రాంతానికి చెందిన సులేమాన్(28) ఆటో డ్రైవర్. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి

అనంతగిరి: భాగ్యరెడ్డివర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి, దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ జిల్లా అభివృద్ధి శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!



అడాల్‌పూర్ రోడ్డుపై గుంతల్లో నిలిచిన వరదనీరు

అధ్వానంగా అడాల్‌పూర్ రోడ్డు

- అవస్థలు పడుతున్న వాహనదారులు, గ్రామస్తులు

యాలాల: అధ్వాన రోడ్లతో మండలవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి అడాల్‌పూర్ రోడ్డు చిత్తడిగా మారింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు పాట్లు పడుతున్నారు. గ్రామానికి బీటీ రోడ్డు విషయమై ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని అడాల్‌పూర్ గ్రామానికి వెళ్లేందుకు తాండూరు మండలంలోని బిజ్వార్ సరిహద్దు నుంచి మెటల్‌రోడ్డు ఉంది. సుమారు 4 కిలోమీటర్ల ఉన్న రోడ్డు కంకరతేలి దారుణంగా మారింది. దీనికితోడు చిన్నపాటి చినుకులకు రోడ్డంత బురదమయంగా మారి ప్రమాదకరంగా మారుతుంది. ఈ సమయంలో ద్విచక్రవాహనదారులు రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఈ రోడ్డును బీటీగా మార్చేందుకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టరు పనులు చేపట్టకపోవడంతో అలాగే ఉండిపోయింది. నిత్యం ఇదే మార్గంలో అడాల్‌పూర్‌వాసులు తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు, వ్యాపారస్తులు, విద్యార్థులు అనునిత్యం ప్రయాణించే ఈ దారి విషయంలో పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి బీటీ రోడ్డు సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గొడవ పడ్డాడనే కోపంతోనే..

- మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి హత్య
- నిందితుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: తనతో గొడవ పడ్డాడనే కోపంతో మద్యం మత్తులో హత్యకు పాల్పడిన వ్యక్తిని గురువారం మహంకాళి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహంకాళి ఏసీపీ సైదయ్య ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ కే ప్రసాద్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈస్ట్‌మారేడుపల్లికి చెందిన శివ అలియాస్ టైల్స్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మద్యం, గంజాయికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఈ నెల 17న రాత్రి అతను ఎస్డీరోడ్డు మంజు థియేటర్ ప్రాంతంలో సేవించాడు. ఈ సందర్భంగా అక్కడ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులతో గొడవ పడ్డాడు. వారిలో ఒకరు అక్కడి నుంచి వెళ్లిపోగా మరో వ్యక్తి సమీపంలోని జేకే ఫర్నిచర్ షాప్ ఎదుట నిద్రిస్తున్నాడు. దీనిని గుర్తించిన శివ బండరాయితో అతడి తలపై మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు శివను గుర్తించి గురువారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదని ఏసీపీ తెలిపారు.

హత్య అనంతరం గుడిలో చోరీ

నిందితుడు శివ గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన అనంతరం మల్కాజ్‌గిరికి వెళ్లిపోయాడు. అక్కడ ఓ సాయిబాబా దేవాలయంలో విగ్రహాలను చోరీ చేశాడు. అతను గతంలోనూ తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దేవాలయాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

'ఇందిరమ్మ'కు మోక్షం

- పదేళ్ల తరువాత కొత్త ఇళ్లు
- ఇబ్రహీంపట్నం మండలానికి 437 మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం లభించింది. దశాబ్ద కాలంగా ఎదురు చూసిన అర్హులకు న్యాయం జరిగింది. ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరువాత అదే ప్రభుత్వ హయాంలో ఇళ్ల పండుగ జరుగుతోంది. బీఆర్‌ఎస్ హయాంలో డబుల్ బెడ్రూంలు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకుండానే పెండింగ్ పెట్టారు!. అధికారంలోకి వస్తే ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట నిలబెట్టుకుంటోంది.

పైలెట్ గ్రామానికి 96

ఇబ్రహీంపట్నం మండలానికి 437 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మండల పరిధి 14 గ్రామాలు పోల్కంపల్లి, నాగన్‌పల్లి, రాయపోల్, చర్లపటేల్‌గూడ, ముకునూర్, నెర్రపల్లి, పోచారం, తుర్కగూడ, తులేకలాన్, ఉప్పరిగూడ, కప్పపహాడ్, ఎల్మినేడు, దండుమైలారం, కర్ణంగూడ ఉన్నాయి. ప్రజాపాలనలో ఈ గ్రామాల పరిధి ప్రజలు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో కప్పపహాడ్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం గుర్తించింది. 96 మంది లబ్ధిదారులను ఫైనల్ చేసి వారికి మంజూరు పత్రాలు అందజేసింది. తదనంతరం అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించారు.

కమిటీ నిర్ణయమే..

అర్హుల ఎంపిక పారదర్శకంగా ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. కానీ పారదర్శకంగా ఉండాల్సిన ఇందిర కమిటీలు.. పార్టీకి అనుబంధంగా ఉన్న వారికే ఇండ్లు కట్టబెట్టారనే ఆరోపణలు లేకపోలేదు. పేరుకు లబ్ధిదారుల ఎంపిక కోసం గెజిటెడ్ అధికారులతో విచారణ చేయించి, కమిటీలు పంపిన ప్రపోజల్స్‌ను ముందుకు తీసుకెళ్లారని ఆరోపిస్తూ.. మరోమారు ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కే సాధ్యం



సంక్షేమ పథకాలు అంటనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే సంక్షేమం. పదేళ్లలో ఒక్క ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదు. ఇప్పుడు అవన్నీ మంజూరవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డికి అందరూ రుణపడి ఉండాలి.

– గురునాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, ఇబ్రహీంపట్నం

ఎంపికలో అవకతవకలు



ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయి. ప్రభుత్వం చెప్పినట్లు ముందుగా పారిశుద్ధ్య కార్మికులకు, ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులకు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలకు ఇచ్చారు. ఇలా చేయడం తగదు. మరోసారి పరిశీలించి, నిజమైన అర్హులను ఎంపిక చేయాలి.

– జగన్, సీపీఎం జిల్లా నాయకుడు



అబ్దుల్లాపూర్‌మెట్: లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

గ్రామాల వారీగా జాబితా

చర్లపటేల్‌గూడ 15, దండుమైలారం 46, కప్పపహాడ్ 96, కర్ణంగూడ 10, ముకునూర్16, నాగన్‌పల్లి 23, నెర్రపల్లి 16, పోచారం 24, పోల్కంపల్లి 29, రాయపోల్ 47, తుర్కగూడ 14, తులేకలాన్ 37, ఉప్పరిగూడ 20, ఎల్మినేడు 44 చొప్పున మంజూరు చేశారు. రెండు రోజులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటిస్తూ.. ప్రొసీడింగ్‌లు అందజేస్తున్నారు.

విజయదశమికి గృహప్రవేశం..

అబ్దుల్లాపూర్‌మెట్ పురపాలికకు 804 ఇళ్లు

అబ్దుల్లాపూర్‌మెట్: వచ్చే విజయదశమి నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని సొంతింట్లోకి అడుగుపెట్టాలని లబ్ధిదారులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘాల పరిధిలో ఎంపిక చేసిన 804 మంది లబ్ధిదారులకు గురువారం పెద్దఅంబర్‌పేటలోని ఎస్ఎస్ఆర్ కళా కన్వెన్షన్ హాల్‌లో ఆయన మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల సాకారం కానుందన్నారు. ఇందులో తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి, నాయకులు మహేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, చెరుకు శివశంకర్‌గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.